సాక్షి
నల్లగొండ
శనివారం । 28 । జనవరి । 2023



యాదాద్రి బస్టాండ్ సిద్ధం
యాదాద్రిలో ఆధ్యాత్మిక హంగులతో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌ను ఫిబ్రవరి 1న ప్రారంభించనున్నారు. - 10లో



ఆర్టీసీకి పునాది రాళ్లు కార్మికులే..
ఆర్టీసీకి పునాది రాళ్లు కార్మికులేనని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం
32°/17°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మంత్రిని కలిసిన ఎస్పీ



మంత్రికి మొక్క అందజేస్తున్న ఎస్పీ

నల్లగొండ క్రైం: జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అపూర్వరావు శుక్రవారం సూర్యాపేటలో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి మొక్క అందజేశారు. అనంతరం ఆమెకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

పోస్టాఫీసుల్లో నేటి నుంచి అకౌంట్ ఓపెనింగ్ డ్రైవ్

నకిరేకల్: తపాలా శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వివిధ స్కీంలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు పోస్టాఫీజుల్లో ప్రత్యేక అకౌంట్ ఓపెనింగ్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని సూర్యాపేట వెస్ట్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.సైదిరెడ్డి తెలిపారు. నకిరేకల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనవరి 1నుంచి పోస్టాఫీస్లుల్లో వడ్డీ రేట్లు పెరిగాయన్నారు. మూడు నెలల కోకసారి పోస్టల్ శాఖ వడ్డీ రేట్లు సవరిస్తూ ఉంటుందని చెప్పారు. సేవింగ్ అకౌంట్‌లో 4 శాతం, రికవరింగ్ డిపాజిట్ 5.8 శాతం, ఒక సవంత్సరం ఫిక్స్‌డ్ డిపాజిట్ 6.6 శాతం, రెండు సంవత్సరాల ఫిక్స్‌డ్ డిపాజిట్ 6.9 శాతం, ఐదు సంవత్సరాల ఫిక్సిడ్ డిపాజిట్ 7 శాతం, మంత్లీ ఇన్‌కం స్కీం 7.1 శాతం , పబ్లిక్ ప్రోవిడెంట్ అకౌంట్ 7.1 శాతం, సుకన్య సమృద్ధి అకౌంట్ 7.6 శాతం,సీనియర్ సిటిజన్ అకౌంట్ 8 శాతం, కిసాన్ వికాస్ పత్ర 7.2 శాతం, నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్ 7 శాతం, చొప్పున వడ్డీలు వర్తిసాయని వివరించారు. ఈ నేపథ్యంలో ఈ మూడు రోజుల పాటు నిర్వహించే పత్యేక అకౌంట్ ఓపెన్ డ్రైవ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


కంటి వెలుగు శిబిరాల సందర్శన

నాంపల్లి: మండలంలోని నాంపల్లి, ముష్టిపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాలను శుక్రవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండల్‌రావు సందర్శించి పరిశీలించారు. రోజు వారీగా చేస్తున్న కంటి పరీక్షలు వివరాలను వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ మహ్మద్ ఇక్బాల్, కిరణ్, శ్రీనివాసులు, వెంకటేష్ శ్రీనివాస్, పుష్ప, మహాలక్ష్మీ, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ఎన్జీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక (గెస్ట్ లెక్చరర్) పోస్టుల భర్తీకి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జువాలజీ 1, కామర్స్ 2, మాథ్స్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ లోపు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

31నుంచి పాతగుట్ట ఉత్సవాలు



రంగులు వేసిన కల్యాణ మండపం

యాదగిరిగుట్ట : యాదాద్రి పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 31నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణ మండపానికి రంగులు వేశారు. విమాన రథాన్ని సిద్ధం చేశారు, హోమాది పూజల నిర్వహణకు హోమ గుండాలు ఏర్పాటు చేశారు.

అధికార పార్టీ తొత్తులుగా మారిన పోలీసులు

మేళ్లచెరువు : రాష్ట్రంలో పోలీసులు అధికార బీఆర్‌ఎస్ పార్టీ కనుసన్నల్లో ఉంటూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను వేధిస్తున్నారని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మేళ్లచెరువు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమను పోలీసులు వేధిస్తున్నారని కార్యకర్తలు తెలపడంతో ఆయన సమావేశం నుంచి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి స్టేషన్ ఎదుట మెట్లపై కూర్చొని నిరసన తెలిపారు. సుమారు రెండు గంటల పాటు పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించారు. సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం అక్కడకు చేరుకొని ఉత్తమ్ కుమార్‌రెడ్డిని సముదాయించి అక్కడ నుంచి పంపించారు.

వెబ్ ఆప్షన్ ద్వారానే..

నేటి నుంచి ఉపాధ్యాయ బదిలీలు
- పదోన్నతుల కోసం ఇప్పటికే కేటగిరీల వారీగా సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ



నల్లగొండ డైట్ కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు బారులుదీరిన ఉపాధ్యాయులు

నల్లగొండ: ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. అందుకు సంబంధించిన జీఓను గురువారం విడుదల చేసింది. దీంతో గతంలో మాదిరిగానే ఈ సారి కూడా వెబ్ ఆప్షన్ ద్వారా పదోన్నతుల ప్రక్రియ చేపట్టేందుకు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ఇందుకు గాను విద్యాశాఖ శనివారం నుంచి చేపట్టే బదిలీల ప్రక్రియకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించనుంది.

ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన

ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి సీనియారిటీని బట్టి ఆయా కేటగిరీల వారీగా 1:3 పద్ధతిన ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. అందులో భాగంగా రెండు రోజుల పాటు నల్లగొండ డైట్‌లో సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం కొనసాగింది. గురువారం హెడ్‌మాస్టర్‌గా పదోన్నతులు పొందేందుకు జనరల్ కేటగిరీతోపాటు ఎస్సీ, ఎస్టీ కేటగిరీల నుంచి ప్రభుత్వ పాఠశాలలు, లోకల్‌బాడీ పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయుల నుంచి 1:3 పద్ధతిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిచి పరిశీలించారు. అలాగే ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందేందుకు లోకల్ బాడీ పాఠశాలలకు సంబంధించి వివిధ కేటగిరీల వారి సర్టిఫికెట్లను వివిధ డీఎస్సీల వారీగా సీనియారిటీ ప్రకారం వెరిఫికేషన్ చేశారు. శుక్రవారం ఒక్కరోజే 2,400 మంది ఉపాధ్యాయులకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది.

బదిలీలకు ఆన్‌లైన్ దరఖాస్తులు..

ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈనెల 30 వరకు 5 సంవత్సరాలు ఒకేచోట పనిచేసిన ఉపాధ్యాయులంతా తప్పనిసరి బదిలీ కావాల్సి ఉండడంతో వారంతా బదిలీల కోసం ఆన్‌లైన్‌లో ఏఏ ప్రాంతాల్లో ఖాళీలు ఉన్నాయో ఆప్షన్లు ఇవ్వనున్నారు. సీనియారిటీని బట్టి వారు కోరుకున్న ప్లేస్‌ను అధికారులు నిర్ణయిస్తారు. మొదట హెడ్‌మాస్టర్లను బదిలీ చేయనున్నారు. ఆ ఖాళీల్లో స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతులు ఇచ్చి భర్తీ చేస్తారు. ఖాళీ అయిన స్కూల్ అసిస్టెంట్ల స్థానంలో ఎస్‌జీటీల నుంచి పదోన్నతులు పొందినవారికి స్కూల్ అసిస్టెంట్లుగా అవకాశం కల్పిస్తారు. ఎస్‌జీటీలో ఖాళీ అయిన వాటిని మాత్రం డీఎస్సీ ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుంది.



సర్వీస్ బుక్ పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి



జాబితా చూసుకుంటున్న ఉపాధ్యాయులు

పండిట్లు, పీఈటీలకూ పదోన్నతులు కల్పించాలని డిమాండ్..

తమకు కూడా పాత పద్ధతినే పదోన్నతులు కల్పించాలని తెలుగు, హిందీ, ఉర్దూ కేటగిరీల్లోని పండిట్లు, పీఈటీలు డిమాండ్ చేస్తున్నారు. గత తెలుగు మహాసభల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ తెలుగు పండిట్ను అప్‌గ్రేడ్ అవకాశం ఇచ్చారు. అయితే తెలుగు పండిట్లను స్కూల్ అసిస్టెంట్ల విభాగ ఖాళీలు పండిట్ల ద్వారానే భర్తీ చేయాలని నిర్ణయిస్తే ఎస్‌జీటీలు కోర్టుకు వెళ్లడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. దీంతో తమకూ అర్హత, సీనియారిటీని బట్టి పదోన్నతులు కల్పించాలంటున్నారు.

బదిలీలకు మెడికల్ బోర్డు ఏర్పాటు

నల్లగొండ: ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి జీఓ నంబర్ 5లో పేర్కొన్న వ్యాధులతో బాధపడే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కోసం మెడికల్ బోర్డును ఏర్పాటు చేసినట్టు డీఈఓ భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి జిల్లా ఆసుపత్రి నుంచి వివిధ విభాగాలకు చెందిన 13 మంది డాక్టర్ల బృందాన్ని నియమించారని పేర్కొన్నారు. వివిధ కేటగిరీల్లో దరఖాస్తు చేసుకునేవారు శనివారం నుంచి 30వ తేదీ వరకు మెడికల్ బోర్డుకు హాజరై ప్రిఫరెన్షియల్ క్యాటగిరీ సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవాలని సూచించారు. దీంట్లో భాగంగా ఉదయం 10గంటల నుంచి సాయంత్రం వరకు డీఈఓ కార్యాలయంలో కేటగిరీని ధ్రువీకరించుకోవాల్సిందిగా కోరారు.

వెబ్‌సైట్‌లో టీచర్ల సీనియారిటీ జాబితా

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర అధికారులు

నల్లగొండ: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు సంబంధించి ఖాళీలు, సీనియారిటీ జాబితా వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితాఇంద్రా రెడ్డి హైదరాబాద్ నుంచి రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, విద్యా శాఖ డైరెక్టర్ దేవసేన, రాష్ట్ర విద్యా మౌలిక వసతుల సంస్థ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డితో కలిసి జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా జరగాలని సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 30 నాటికి జిల్లాలో ఎంపిక చేసిన 32 మోడల్ పాఠశాలలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మిగతా పాఠశాలల్లో కూడా అన్ని పనులు ఫిబ్రవరి 10 నాటికి పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, డీఈఓ భిక్షపతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రతి అధికారి బాధ్యతగా విధులు నిర్వర్తించాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సూచించారు. మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతి జడలరామలింగేశ్వర స్వామి బ్రహ్మత్సవాలు శనివారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో అక్కడ కొనసాగుతున్న ఏర్పాట్లను శుక్రవారం నల్లగొండ ఆర్డీఓ జయచంద్రారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గట్టుపైన, కింద వివిధ ప్రదేశాలతోపాటు కల్యాణ మండపం, కోనేరు, టాయిలెట్లు, పారిశుద్ధ్యం, తాగునీటి వసతి ఏర్పాట్లను చూసి అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌ఓ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ముజీబుద్దీన్, దేవాదాయ శాఖ ఏసీ మహేంద్రకుమార్, ఆలయ అధికారి నవీన్‌కుమార్, సర్పంచ్ మాల్గ బాలకృష్ణ, తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీఓ యాదగిరి, ఎస్ఐ రామకృష్ణ, సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

నార్కట్‌పల్లి మండలం చెరువుగట్టు గ్రామంలో వెలిసిన శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరగనున్నాయి. 29న స్వామివారి కల్యాణం జరగనుంది. ఇందు కోసం దేవాదాయ శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది.

- వివరాలు 8లో

కంటి పరీక్షలు చేయించుకోవాలి



వేములపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

మిర్యాలగూడ: అర్హులైన ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేసుకొని లబ్ధిపొందాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం వేములపల్లి మండల కేంద్రంలోని గ్రంథాలయంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కంటి వెలుగును పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పుట్టల సునీత, తహసీల్దార్ వెంకటేశం, ఎంపీడీఓ అజ్మీరాదేవిక, సర్పంచ్ చిర్ర మల్లయ్యయాదవ్, డాక్టర్లు సుచరిత, రోహిత్‌రెడ్డి, సూపర్‌వైజర్లు పద్మ, శైలజ, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను సర్వే చేయండి

అడవిదేవులపల్లి: మండలంలోని ప్రభుత్వ భూములపై త్వరితగతిన సర్వే నిర్వహించి, రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఉల్సాయిపాలెం గ్రామంలో గల 145 సర్వే నంబర్‌లోని పార్ట్ బీలో సుమారు 1,630 ఎకరాల భూమిలో కబ్జాలో ఉన్న రైతుల వివరాల సేకరణకు సర్వే చేసి నివేదిక పంపించాలన్నారు. అదేవిధంగా మండలంలోని అడవిదేవులపల్లి, ముదిమాణిక్యం, కొత్తనందికొండ గ్రామాల్లో ఉన్న భూములను కూడా సర్వే నిర్వహించి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని ఆయా గ్రామాల రైతులు ఈ సందర్భంగా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ రఘు, డీఐ బాలాజీ, ఆర్ఐ ఠాగూర్ రామకృష్ణ, ఎంపీపీ బాలాజీనాయక్, జెడ్పీటీసీ సేవ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

జంతు హింసను నివారించాలి



ర్యాలీలో పాల్గొన్న జేడీ యాదగిరి, అధికారులు

నల్లగొండ అగ్రికల్చర్ : జంతు హింసను నివారించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అంబటి యాదగిరి పిలుపునిచ్చారు. జంతు హింస నివారణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రభుత్వ బాలుర హైస్కూల్ విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్పీ రోడ్డు, గడియారం సెంటర్, ప్రకాశం బజార్ మీదుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ వన్యప్రాణులను రక్షించుకోవాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ రాచకొండరెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో బ్యాంకు సేవలు!

- డీలర్ల ద్వారా గ్రామీణులకు అందించాలని నిర్ణయం
- పౌరసరఫరాల శాఖతో పోస్టల్ శాఖ ఒప్పందం
- పోస్టాఫీస్‌లేని పల్లెల్లో ఆన్‌లైన్ సేవలు అందేలా చర్యలు
- ఆసక్తి ఉన్న డీలర్లు ముందుకు రావాలని సూచన



హాజరైన పోస్టల్ శాఖ అధికారులు, రేషన్ డీలర్లు

నల్లగొండ: గ్రామాల్లోని రేషన్ షాపులే ఇకనుంచి బ్యాంకులుగా అవతరించనున్నాయి. పోస్టాఫీస్ లేని గ్రామాల్లో రేషన్ డీలర్ల ద్వారా బ్యాంకు సేవలు అందించేందుకు పౌరసరఫరాల శాఖతో తపాలా శాఖ ఒప్పందం చేసుకుంది. దీంతో ఇక.. గ్రామీణ ప్రజలు డబ్బులు డ్రా చేసుకునేందుకు.. ఇతర ఆన్‌లైన్ సేవలకు పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

844 పంచాయతీల్లో 911 రేషన్ షాపులు..

జిల్లాలో 844గ్రామ పంచాయతీల్లో 991 రేషన్ షాపులు ఉన్నాయి. వాటి ద్వారా ప్రభుత్వం సబ్సిడీ బియ్యంతోపాటు ఇతర సరుకులను కూడా పంపిణీ చేస్తుంది. అయితే ఇక నుంచి రేషన్ షాపుల ద్వారానే గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందనున్నాయి. అయితే ఏ గ్రామంలో అయితే పోస్టాఫీస్ లేదో ఆ గ్రామంలో ఉన్న రేషన్ షాపు ద్వారా పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో బ్యాంకింగ్ సేవలు అందించనున్నారు.

డీలర్లు ముందుకొచ్చిన గ్రామాల్లో సేవలు..

ఏ గ్రామంలో అయితే పోస్టాఫీస్ ఉండదో అక్కడ రేషన్ డీలర్ ముందుకు వస్తే అతనికి పోస్టల్ శాఖ ఆన్‌లైన్ యాప్‌ను ఇస్తుంది. యాప్ ద్వారా కంప్యూటర్, సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ సేవలు నిర్వహించుకోవచ్చు. అంతేకాక పోస్టాఫీస్ తరహాలోనే బ్యాంకింగ్ సేవలను కూడా అందించనున్నారు. రైతుబంధు డబ్బులు వంటివి చిన్నచిన్న అమౌంట్లు డ్రా చేసుకునేందుకు అవకాశం ఉండనుంది. అంతేకాక లైఫ్, జనరల్ ఇన్సూరెన్స్, ఇతర ఆన్‌లైన్ సేవలు అందుతాయి. ఈ విధానం ద్వారా డీలర్లకు ప్రతి సేవకు ఒక రేటు ఉంటుంది. దాన్ని బట్టి డీలర్లకు ప్రతినెలా అదనపు ఆదాయం రానుంది. అదేవిధంగా పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే గ్రామ ప్రజలకు బ్యాంకు సేవలు, ఇతర ఆన్‌లైన్ సేవలు కూడా అందనున్నాయి.



మాట్లాడుతున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

సద్వినియోగం చేసుకోవాలి : డీఎస్‌ఓ

ఆసక్తి ఉన్న డీలర్లంతా ఈ విధానాన్ని సద్వినియోగం చేసుకుంటూ అదనపు ఆదాయం పొందాలని డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఇండియన్ పోస్టల్ సీనియర్ మేనేజర్లు ఫణీ, లక్ష్మీకాంత్‌లతో కలిసి కలెక్టరేట్‌లో జిల్లాలోని డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ షాపుల ద్వారా అందించనున్న ఆన్‌లైన్ సేవలపై డీలర్లకు అవగాహన కల్పించారు. ఆసక్తి ఉన్న డీలర్లు ముందుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ అధికారులు రవీంద్రనాయక్, డీలర్ల సంఘం అధ్యక్షుడు పారేపల్లి నాగరాజు, పౌరసరఫరాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఉర్సుకు తరలి వచ్చిన భక్తజనం

జాన్‌పహాడ్ జనసంద్రం

- వైభవంగా జాన్‌పహాడ్ దర్గా గంధోత్సవం
- సైదన్న నామస్మరణతో మార్మోగిన దర్గా పరిసరాలు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రముఖులు
- లక్షకుపైగా తరలివచ్చిన భక్తులు

పాలకవీడు : జాన్‌పహాడ్ సైదన్న ఉర్సుకు రెండో రోజు శుక్రవారం భక్తజనం పోటెత్తారు. ఉత్సవాల్లో భాగంగా వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన పవిత్ర గంధానికి చందల్‌ఖానాలో ప్రముఖుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎంపీ బడుగుల లింగయ్య, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, వక్ఫ్‌బోర్డు పెద్దలు గంధం కలశాన్ని ఎత్తుకుని ఊరేగింపును ప్రారంభించారు. కుటుంబ సమేతంగా కలెక్టర్ హేమంత్‌కేశవ్ పాటిల్ దర్గాను సందర్శించారు. ప్రత్యేకంగా అలంకరించిన అశ్వంపై పవిత్ర గంధాన్ని గ్రామ పురవీధుల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రత్యేక పోలీసు బలగాలతో ఊరేగింపు నిర్వహించిన అనంతరం దర్గాకు తీసుకుచ్చారు. గంధాన్ని దర్గాలోకి తీసుకొచ్చి సైదులు బాబా సమాధులపై పెట్టి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాలోకి గంధాన్ని తీసుకొచ్చే సమయంలో భక్తులు అధిక సంఖ్యలో ఉండడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. రాష్ట్రం నలుమూలల నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి బస్సులు, ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై లక్షకు పైగా భక్తులు దర్గాను సందర్శించారు. దర్గా సమీపంలో ఉన్న నాగుల పుట్ట వద్ద మహిళలు పాలు, పండ్లు, గుడ్లు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో ఆర్డీఓ వెంకారెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ ముసిల్లాఖాన్, సీఈఓ ఖాజామొహినుద్దీన్, దర్గా ఇన్‌స్పెక్టర్ మహమూద్, బాబా, ఫిరోజ్ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ఇతర అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.



నాగులమీరా పుట్ట వద్ద భక్తుల పూజలు

క్లుప్తంగా

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి



సీడీపీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ యకులు

భువనగిరి : సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో రిటైర్ అయిన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆ సంఘం జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్స్‌కు కేంద్రం పెంచిన వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల ఏరియార్స్‌తో పాటు 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలను చెల్లించాలన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం సీడీపీఓ స్వరాజ్యానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి చిలువేరు రమాకుమారి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశం, నాయకులు ప్రమీల, షాహెద, రుక్మిణి పాల్గొన్నారు.


నేటినుంచి చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు



చెర్వుగట్టు పైకి వెళ్లే ప్రధాన ద్వారం



చెర్వుగట్టు దేవాలయం



మూడు గుండ్ల ప్రాంతం

రామలింగేశ్వరుడి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- 29న స్వామివారి కల్యాణం
- ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న చెర్వుగట్టు
- దక్షిణ తెలంగాణ జిల్లాల నుంచి తరలిరానున్న భక్తులు



శివుని విగ్రహం

నార్కట్‌పల్లి : ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న నార్కట్‌పల్లి మండలంలోని చెరువుగట్టు గ్రామంలో వెలిసిన శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయ ఉత్సవాలకు వేళైంది. శనివారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. చెరువుగట్టు కొండపై వెలిసిన రామలింగేశ్వరుడు భక్తజన బాంధవుడిగా వెలుగొందుతున్నాడు. స్వామి వారు జడల ఆకృతిని పోలి ఉండటంతో జడల రామలింగేశ్వరుడిగా పిలువబడుతున్నారు.

బ్రహ్మోత్సవాల్లో జరిగే కార్యక్రమాలు

దేవాలయంలో ప్రధాన మండపంలో ప్రజాప్రతినిధుల గ్రామ పెద్దల సమక్షంలో అర్చకులు ప్రత్యేక పూజలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభిస్తారు. 28న ఉత్సవాల ప్రారంభానికి విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తదితరులు హాజరవుతారు. ప్రత్యేక పూజలతో బ్రహ్మోత్సవాలను పండితులు అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని, నీలకంఠశివాచార్య, దేవాలయ ప్రధాన అర్చకులు రామలింగేశ్వరశర్మ మరో 20 మంది అర్చక బృందం ప్రారంభిస్తారు. 29వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు కల్యాణ మండపంనందు స్వామివారి కల్యాణం జరుగుతుంది. అదే రోజు రాత్రి కోనెరులో తెప్పోత్సవం, 30వ తేదీ తెల్లవారుజామున 4గంటలకు అగ్నిగుండాలు, 31వ తేదీ తెల్లవారు జామున దోపోత్సవము, సాయంత్రం ఏకాంతసేవ, ఫిబ్రవరి 1న ఉదయం రుద్రాభిషేకం, ఏకాంతసేవ, 2న సాయంత్రం గజవాహనముపై స్వామి, అమ్మవార్ల, చెరువుగట్లు, ఎల్లారెడ్డిగూడెం గ్రామాల్లో ఊరేగింపు జరుగుతుంది. స్వామి వారి కల్యాణ్యాన్ని భక్తులందరూ తిలకించేందుకు ప్రత్యేకంగా 6 ప్రొజెక్టర్ స్క్రీన్లను కొండ పైన, కింద ఏర్పాటు చేస్తున్నారు. కొండపైన కింద ప్రత్యేకంగా ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. పారిశుద్ధ్యం మెరుగునకు తగిన సిబ్బందిని నియమించారు. డీఎల్‌పీఓ లక్ష్మీనారయణ, ఎంపీడీఓ యాదగిరి పర్యవేక్షణ చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శికిరణ్‌కుమార్ తెలిపారు. గట్టుపైన, కింద విచారణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని పోలీసులు తెలిపారు,

ప్రత్యేక పార్కింగ్

నార్కట్‌పల్లి నుంచి వచ్చే వాహనాలకు చెర్వుగట్టు గ్రామ శివారులో, ఎల్లారెడ్డిగూడె నుంచి వచ్చేవారికి దారిలో, ఏపీ లింగోటం నుంచి వచ్చే వారికి గామ శివారులో ప్రత్యేకంగా పార్కింగ్ వసతి ఏర్పటు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేయు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు నార్కట్‌పల్లి డిపో మేనేజర్ వెంకటమ్మ తెలిపారు. నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగుడ, దేవరకోండ డిపో నుంచి బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి 5నిమిషాలకు ఒక బస్సు చొప్పున నడుపుతున్నట్లు చెప్పారు. హైదరాబాద్, భువనగిరి నుంచి నల్లగొండకు వచ్చే ప్రతి ఆర్డీనరి సర్వీసు చెర్వుగట్టు మీదుగా వెళ్లనున్నట్లు తెలిపారు.

అమావాస్య ప్రత్యేకత

ప్రతి నెల అమావాస్యకు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి దేవస్థానానికి లక్షల కొలది సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకొని ఆ రాత్రి అక్కడే నిద్రచేస్తారు. మరుసటిరోజు స్వామిని దర్శించుకొని వెళ్లడం ఆచారంగా కొన్నసాగుతుంది.

ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు



ఉత్సవాలకు విచ్చేయు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం, భక్తులకు నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, సౌకార్యలు కల్పించేందుకు 8 జోన్‌లు ఏర్పాటు చేశాం. జోన్‌కు జిల్లా స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించాం. విద్యుత్ సమస్య పరిష్కారానికి గట్టు పై 100 కేవీ టాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయిస్తున్నాం.

– జయచంద్రారెడ్డి, ఆర్డీఓ

ఆరు రోజుల పాటు ఉత్సవాలు



శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆరు రోజుల పాటు జరగనున్నాయి. ఉత్సావాలుకి ఆర్డీఓ జయచంద్రరెడ్డి , డీఎస్పీ సర్సింహారెడ్డి పర్యవేక్షణలో జరగనున్నాయి. బ్రహ్మత్సవాల గురించి ప్రజలకు తెలియ జేయడానికి గాను జిల్లాలోనే కాకుండా ఇతర జిల్లాల్లో కూడా ప్రచారం చేస్తున్నాం.

– సిరికొండ నవీన్‌కుమార్, ఈఓ

భక్తులకు ఇబ్బందులు కలగకుండా..



బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ముఖ్యంగా పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు సిబ్బందిని నియమించాం. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నీటి సౌకర్యం, మరుగు దొడ్ల ఏర్పాటు చేయించాం. భక్తులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెత్త కుండీలను వినియోగించుకుని సహకరించాలి.

– బాలకృష్ణ, చెర్వుగట్టు సర్పంచ్

కొత్త వంగడాల సాగుకు పంట మార్పిడి చేయాలి



రైతులకు పెసర విత్తనాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

మోతె: కొత్త వంగడాల సాగుకు పంట మార్పిడి చేయాలని కేవీకే శాస్త్రవేత్తలు డి.నరేష్, కిరణ్ రైతులకు సూచించారు. శుక్రవారం మోతె మండల పరిధిలో రావిపహాడ్ క్లస్టర్ రైతు వేదికలో జరిగిన శ్రీ అరవింద కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపెల్లి వారి ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత పథకం పప్పు దినుసుల పెసర పంటల సామూహిక ప్రదర్శన క్షేత్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవన ఎరువులు, సేంద్రియ ఎరువుల వాడకం మూలాన ఖర్చు తగ్గడంతో పాటు పంట దిగుబడి సాధించవచ్చన్నారు. ప్రతి రైతు జీవన,సేంద్రియ ఎరువులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పెసర, మినుము పంటల్లో చీడపీడలపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం రైతులకు జీవ ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి కార్తిక్, రైతులు మల్లారావు, మధుసూదన్ రెడ్డి, హేమేందర్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల సాగుతో అధిక లాభాలు

నడిగూడెం : పుట్టగొడుగుల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఆదర్శ రైతు దంపతులు వాసికర్ల శేషు కుమార్, లక్ష్మీప్రియ తెలిపారు. శుక్రవారం మండలంలోని సిరిపురం గ్రామంలో సమీకృత వ్యవసాయ చేస్తున్న వాసికర్ల శేషుకుమార్ వ్యవసాయ క్షేత్రాన్ని నాబార్డు సహకారంతో నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన రైతు ఉత్పత్తిదారుల సంఘం నుంచి మహిళా రైతులు క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా పుట్టగొడుగుల సాగుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆ దంపతులు మాట్లాడారు. తక్కువ భూమిలో అధిక పంటలు సాగు చేయవచ్చని, అలాగే నిత్యం ఆదాయం ఉండాలంటే సమీకృత వ్యవసాయం చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పుట్టగొడుగుల పెంపకం, మార్కెటింగ్, పలు సేంద్రియ పద్ధతులు, ద్రావణాల తయారీ, పశుగ్రాసాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 40 మంది మహిళా రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారించాలి



షెడ్డులో పెంచుతున్న గొర్రెలను పరిశీలిస్తున్న రెడ్డి ల్యాబ్ హెడ్ నారాయణ రెడ్డి

త్రిపురారం : వ్యవసాయంలో ఒక్క పంటల పైనే కాకుండా వ్యవసాయ అనుబంధ రంగాలతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ హెడ్ నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం త్రిపురారంలో నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వ్యవసాయ క్షేత్రంలో కేంద్ర ప్రభుత్వ పథకం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా పెంచుతున్న కోళ్లు, గొర్రెల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కోళ్లు, గొర్రెలకు అందించే దానా గడ్డి రకాలు ఆదాయంపై వివరాలు అడిగి తెలుసున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్, బాబుసాయి పేట సర్పంచ్ శ్రవణ్ కుమార్, డైరెక్టర్ నాగరాజు, అనిల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి అధితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రామన్నపేట : ఆలేరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న చరిత్ర అధ్యాపక పోస్టును అతిథి లెక్చరర్‌తో భర్తీ చేయనున్నట్లు రామన్నపేట ప్రభుత్వ (ఐడీ) డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం కలిగిన జనరల్ అభ్యర్థులు, 50శాతం మార్కులు గల ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు నెల 31వ తేదీలోగా ధీరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నార్కట్‌పల్లి వైద్య కళాశాల ఎదుట ఆందోళన

నార్కట్‌పల్లి : వైద్య కళాశాల యాజమాన్యం తమ పిల్లల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆరోపిస్తూ శుక్రవారం నార్కట్‌పల్లి వైద్య కళాశాల ఎదుట విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ నార్కట్‌పల్లి వైద్య కళాశాలలో చదువుతున్న నాల్గో సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 21వ తేదీ నుంచి పరీక్షలు ఉన్నాయని, అర్ధరాత్రి సమయంలో పరీక్ష ఫీజుల లింకును కల్పించడం విడ్డురంగా ఉందన్నారు. పరీక్ష ఫీజులను కట్టేందుకు అనుమతించకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్ మాట్లాడేందుకు ఎందుకు ముఖం చాటేస్తున్నారని ప్రశ్నించారు. విద్యార్థులకు అటెండెన్స్ ఉన్నప్పటికీ కళాశాల యాజమాన్యం పరీక్షలు రాసేందుకు ఎందుకు అనుమతించడం లేదని అన్నారు. 150 మంది విద్యార్థులకు పరీక్షలకు అనుమతించకపోవడం దారుణమన్నారు.

అధునాతన పద్ధతిలో మెట్ట వరిసాగు



మెట్ట వరి సాగుపై అవగాహన కార్యక్రమానికి హాజరైన రైతులు

మిర్యాలగూడ: డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధునాతన పద్ధతిలో మెట్ట వరి సాగును మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామంలోని కట్టా దామోదర్‌రెడ్డి పొలంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ వీరస్వామి మాట్లాడుతూ యూరియా, పొటాష్, అడుగుపిండి కలిపి తయారుచేసిన గుళికలను మెట్టసాగు పద్ధతిలో సుమారు 8 నుంచి 10 అంగుళాల భూమిలో వేయడంతోపాటు పై భాగంలో మూడు అంగుళాల్లో విత్తనాలు వేశారు. దీంతో భూమిలో పెట్టిన గుళికలు ద్వారా మొక్కకు సరిపడ పోషకాలు అంది మంచి దిగుబడులు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఫెసిలిటర్ సబ్బు సింగ్, రమేష్, రైతులు జెర్రిపోతుల వెంకన్న, చింతపల్లి సీతారాములు, కొడదల సైదులు, ఇండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్లను సబ్సిడీపై ఇవ్వాలి

భువనగిరి : భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్లను సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీసీడబ్ల్యూ, సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు రాములు, కోమటిరెడ్డి చంద్రారెడ్డి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రూ. 54 వేల క్లెయిమ్స్‌కు వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు. లేబర్ ఆఫీస్‌లో ఖాళీలను భర్తీచేసి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారికి రూ. 10 లక్షలు, సహజ మరణానికి రూ. 5 లక్షలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, నర్సింహ్మా, శ్రీనివాస్, రామచంద్రం, మైసయ్య, అమరేందర్, మారయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధికి ఆయిల్ పాం సాగు దోహదం

ఆత్మకూరు(ఎం): రైతుల ఆర్థిక అభివృద్ధికి ఆయిల్ పాం సాగు దోహదం చేస్తుందని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొరటికల్‌లో రైతు దూసరి రాజు వ్యవసాయ భూమిలో ఆయిల్ పాం మొక్కలు నాటిన అనంతరం మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆయిల్ పాం సాగు చేయడానికి రైతులు ముందుకు వస్తున్నారని చెప్పారు. జిల్లాలో నాలుగు వేల ఎకరాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు ఒక వెయ్యి ఎకరాల్లో సాగు చేసినట్లు తెలిపారు. దేశంలో వంట నూనెల కొరత అధిగమించడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, అందులో భాగంగా బడ్జెట్‌లో రూ. వెయ్యి కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోల సత్తయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, ఆత్మ రాష్ట్ర డైరెక్టర్ సోలిపురం అరుణాఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా జాన్‌పహాడ్ దర్గా గంధోత్సవం



పాటలు పాడుతున్న ఖవ్వాలీ బృందం



ఆరుబయట భోజనాలు చేస్తున్న భక్తులు



దర్గా వద్ద కిక్కిరిసిన భక్తులు



దర్గాలో భక్తుల కోలాహలం



మొక్కు చెల్లించేందుకు వస్తున్న భక్తురాలు